www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 26 డిసెంబర్ 2024

వైఎస్ఆర్

నేడు 33 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కడప

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లాలో 33 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ లోని అట్లూరు మండలం నల్లాయపల్లి, బి.కోడూరు మండలం, పెద్దులపల్లి, బి మఠం మండలం మల్లెపల్లె, బద్వేల్ మండలం ఇమడపురం, కలసపాడు మండలం గోపవరం పల్లి, మైదుకురు మండలం గంజికుంట, పోరుమామిల్ల మండలం చెర్లోపల్లి, కాశినాయన మండలంలో నరసాపురం, పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని చక్రాయపేట మండలం సురభి, లింగాల మండలం కొమ్మనూతల, పులివెందుల మండలం ఉలిమెల సింహాద్రిపురం మండలం దుద్దెకుంట, తదితర గ్రామాల్లో నిర్వహిస్తారన్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'తల్లికి వందన'మేదీ?

- ఆర్నెళ్లుగా... తప్పని నిరీక్షణ

- 3,26,752 మంది తల్లులు ఎదురుచూపులు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తల్లికి వందనం పథకం అమలు కోసం తల్లిదండ్రులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఆర్నెళ్లుగా విద్యార్థుల డేటా, నిధుల లేమి వంటి కారణాలతో కాలయాపన చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికీ రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. వైసిపి హయాంలోని అమ్మఒడి పథకం పేరు మార్చు, ఇటీవలి బడ్జెట్‌లో రూ.2,326 కోట్లు కేటాయింపులు చేయడం మినహా ఎటువంటి పురోగతి కనిపించలేదు. ఇటీవలి కేబినెట్ సమావేశంలోనూ తల్లికి వందనంపై ఎటువంటి చర్చా లేకుండా ముగించడంతో తల్లికి వందనం పథకం ఈ ఏడాది అమలు చేసే ఉద్దేశం లేనట్లు తేటతెల్లం కావడం గమనార్హం.

ఉమ్మడి కడప జిల్లాలో 2,823 పాఠశాలలు ఉన్నాయి. 3,26,752 మంది విద్యాభ్యాసం సాగిస్తున్నారు. 2022-23 సంవత్సరంలో అప్పటి వైసిపి సర్కారు అమ్మఒడి పథకం కింద 1.80 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.270.30 కోట్లు జమ చేసింది. 2021-22 సంవత్సరంలో 1.79 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.244.06 కోట్లు జమ చేసింది. వైసిపి సర్కారు నాలుగేళ్లపాటు జనవరి, జూన్ మాసాల్లో వరుసగా అందజేసింది. అమ్మఒడి నిధుల సహకారంతో ప్రయివేటు, కార్పొరేట్ అధిక ఫీజుల చెల్లింపుల సమయంలో తల్లిదండ్రులకు పెద్ద ఉపశమనం లభించేది. రాష్ట్రంలోని కూటమి సర్కారు ఆర్నెళ్లుగా సామాన్యుల ఆశలతో ఆడుకోవడం భారంగా పరిణమించింది. ఫలితంగా జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఫీజుల చెల్లింపు భారంగా మారింది.

తల్లుల ఎదురుచూపులు

తల్లికి వందనం పథకం కోసం విద్యార్థుల తల్లులు ఎదురు చూస్తున్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున జమ చేస్తామని ప్రభుత్వం నమ్మబలికింది. ఆర్నెళ్లు గడిచి పోతున్నప్పటికీ తల్లికి వందనం అమలును విస్మరించింది. ఫలితంగా తల్లిదండ్రులు ప్రయివేటు, కార్పొరేట్ ఫీజుల చెల్లింపు పెనుభారంగా మారింది.

డేటా మెలిక...దేనికో!

కూటమి సర్కారులో చిత్తశుద్ధి కొరవడిన కారణంగానే తల్లికి వందనం అమలు కావడం లేదనే వాదన వినిపిస్తోంది. శాసన మండలిలో విద్యాశాఖ మంత్రి లోకేష్ తల్లికి వందనం పథకం అమలుపై స్పందిస్తూ లబ్ధి దారుల డేటా లేని కారణంగా ఇవ్వలేకపోతున్నామనడం దేనికి సంకేతమో తెలి యడం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ నేపథ్యంలో పిల్లల ందరికీ తల్లికి వందనం ఇవ్వాల్సి వస్తే రెట్టింపు వ్యయం చేయాల్సి ఉన్నట్లు తెలు స్తోంది. సార్వత్రిక ఎన్నికల ముగింపు సంవత్సరమైన 2022-23లో వైసిపి సర్కారు రూ.270 కోట్లు చెల్లించిన సంగతి తెలిసిందే. ఈలెక్కల్ని పరిగణలోకి తీసుకుని లెక్కిస్తే రూ.500 కోట్లుపైగా చెల్లించాల్సి వచ్చే అవకాశం ఉండడంపై మీన మేషాలు లెక్కిస్తున్నట్లు కనిపిస్తోంది. కూటమి సర్కారు వైఖరిని పరిశీలిన చేస్తే ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్, ఎయిడెడ్, కళాశాలల విద్యార్థుల్లో ఎవరికి మొండిచేయి చూపుతుందోననే ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొని ఉంది.

క్రిస్మస్ వేడుకల్లో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప జిల్లాలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రెండో రోజు కడప జిల్లా పులివెందులలోని సిఎస్ఐ చర్చిలో తన తల్లి వైఎస్.విజయమ్మ, సతీమణి వైఎస్.భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థన కూట మిలో పాల్గొన్నారు. అనంతరం సిఎస్ఐ చర్చిలో విజయమ్మతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి ఆమెకు తినిపించారు. సిఎస్ఐ చర్చి రూపొ ందించిన నూతన సంవత్సర కేలండర్‌ను జగన్ ఆవిష్క రించారు. రాష్ట్ర ప్రజలకు ఆయన క్రిస్మస్ శుభాకాం క్షలు తెలిపారు. ప్రార్థనా కూటముల అనంతరం చర్చిలో జగన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్య పథం వైపు నడవాలని చెప్పారు. కరుణామయుని ఆశీస్సులు అందరికీ అందాన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్. అవి నాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, రాయ చోటి, రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరుముట్ల శ్రీని వాసులు, వైఎస్ కుటుంబ సభ్యులు వైఎస్.ప్రకాష్‌రెడ్డి, వైఎస్. మనో హర్‌రెడ్డి, వైఎస్. మదన్ మోహన్‌రెడ్డి, వైఎస్. ప్రతాపరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, ప్రజాప్రతి నిధులు, పాస్టర్స్ పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

కోదండ రామునికి పట్టు వస్త్రాలు సమర్పించిన జగన్

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లెలో రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీకొందడ రాముని ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, ఆలయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రారంభించారు. భక్తి శ్రద్ధలతో సీతారాములకు ఆయన పట్టువస్త్రాలు సమర్పించారు. వేదప ండితులు ఆలయ పెద్దలు, గ్రామ స్థులు జగన్‌ను మార్యాదపుర్వంగా ఆహ్వా నించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఆయనకు పలు రకాల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు అంతకు ముందు పులివెందులలో సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తర్వాత ప్రత్యేక వాహ నంలో లింగాల మండలోని ఇప్పట్ల, చిన్న కూడాల, లింగాల, కార్నపాపయ్యపల్లె, వెలిదండ్ల వైసిపి నాయకులు, కార్యకర్తలను దారి పొడవునా పరా మర్శించారు. కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్. అవినాష్‌రెడ్డి, తాతిరెడ్డిపల్లె సర్పంచ్ శివరామిరెడ్డి, జడ్‌పి టిసి పుష్పా, తాతిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మల్లికేశవరెడ్డి, ఎంపిపి రమాదేవి పాల్గొన్నారు.

జగన్‌కు కేక్ తినిపిస్తున్న తల్లి విజయమ్మ

ఎన్నికైన నూతన కార్యవర్గం

ఎపి జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీనివాసులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నూతన జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సాయి భువన్ యాదవ్, జనరల్ సెక్రటరీ బి.లెనిన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.వినోద్ కుమార్, జాయింట్ సెక్రటరీగా కె.సంధ్యారాణి, ట్రెజరర్ కె.వి సుబ్బయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నవారికి కృతజ్ఞతలు తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న అటవీ శాఖ అధికారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్ : అంబేద్కర్‌పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వైఖరికి నిరసనగా 'అంబేద్కర్ - రాజ్యాంగం - ప్రజాస్వామ్యం అపహాస్యం' అనే అంశంపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, కో కోన్వీనర్స్ లక్ష్మిరాజా, గుర్రప్ప, గోపాల్, లెనిన్ ప్రసాద్, భాస్కర్, వెంకటేశ్వర్లు, లెఫ్ట్ పార్టీల నాయకులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు ఇంజినీర్స్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాస్వామ్య, అభ్యుదయ, అంబేద్కర్ వాదులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఎల్ఐసి సర్కిల్ వద్ద ఈ నెల 22న అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్ టౌన్ ఎస్ఐ అమర్ నాథ్ రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా సదరు వ్యక్తిని స్థానికుల సమాచారంతో వెంటనే అంబులెన్స్‌లో రిమ్స్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ ఉన్నాడన్నారు. సదరు వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్ఐ కోరారు. మృతుని వివరాలు తెలిస్తే సిఐ రామకృష్ణ తెలిపారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కృషి

- హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని

ప్రజాశక్తి - కడప అర్బన్

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కలిసికట్టుగా పనిచేద్దామని హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని అన్నారు. బుధవారం నగరంలోని నూర్జహాన్ కల్యాణమండపం లో రాయలసీమ నుంచి రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు ఎన్నికైన దావూద్ బాష సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యావంతుడు, మతగురువు అయిన దావూద్ బాషా పేరును ప్రతిపాదించి ఆయన నియామకానికి కారకులైన కడప ఎమ్మెల్యే, విప్ మాధవి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 'ఉమ' రాష్ట్ర అధ్యక్షులు షంషుద్దీన్, న్యాయవాది అతావూర్ రెహ్మాన్, అబ్దుల్ ఖయుమ్ ఖాన్, బషీర్, జాబీవూర్ రెహ్మాన్, అరిష్ అహ్మద్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సభ్యుడిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని

అమిత్‌షా రాజీనామా కోరుతూ..

30న నిరసనలను విజయవంతం చేయాలి

జమిలి ఎన్నికల ప్రతిపాదన సమాఖ్య వ్యవస్థపై వేటు

వామపక్ష పార్టీల జిల్లా కార్యదర్శులు

ప్రజాశక్తి - కడప అర్బన్

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా కోరుతూ ఈ నెల 30న ఆందోళన జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల జిల్లా కార్యదర్శులు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ కార్యదర్శి రమణయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్‌షా, ప్రధాని నరేంద్ర మోడీ ఇందుకు బాధ్యత వహించడానికి, దిద్దుబాటు చర్యలకు సిద్ధపడకపోవడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో నిరసనలను కొనసాగించాలని లెఫ్ట్ పార్టీలు భావించాయని తెలిపారు. 30న జాతీయ నిరసన దినాన్ని పాటించాలని నిర్ణయించామని చెప్పారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైన మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రయివేటు కంపెనీల చేతుల్లో పెట్టి, సంపదను అంబాని, ఆదానికి దోచిపెడుతూ ప్రజలు, ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెట్టేసారని విమర్శించారు. కులం, మతం, ప్రాంతం, భావం పేరుతో ప్రజల మధ్య వైశ్యామ్యాలు రెచ్చగొట్టి ఒక ప్రణాళికాబద్ధంగా ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీ, మహిళలపై హింసను ప్రేరేపిస్తున్నదన్నారు. స్వతంత్ర సంస్థలైన సిబిఐ, ఈడి, ఎన్నికల కమిషన్ ను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ, న్యాయవ్యవస్థను కూడా ప్రభావితం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చలాయిస్తోందని పేర్కొన్నారు. బహుజనుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను తలుచుకుంటే ఏమొస్తుంది అంటూ అవాకులు, చెవాకులు పేలిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాటల వెనుక ఆర్ఎస్ఎస్ మనువాద ఎజెండా దాగి ఉందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

మనసు నిండా మనువాదాన్ని నింపుకుని అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించే బిజెపి నేతలకు రాజ్యాంగబద్ధ పదవుల్లో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. భారత జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒక దేశం, ఒక ఎన్నిక ప్రతిపాదనను వామపక్షాలు వ్యతిరేకించాయని పేర్కొన్నారు. ఇందుకోసం రాజ్యాంగ సవరణ బిల్లుతో సహా రెండు బిల్లులను ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని తెలిపారు. రాజ్యాంగానికి ప్రతిపాదించిన సవరణలు సమాఖ్య వ్యవస్థపైన, రాష్ట్రాల శాసనసభలు, వాటిని ఎన్నుకున్న ప్రజల హక్కులపై నేరుగా దాడి చేయడమేనని విమర్శించారు. శాసనసభల ఐదేళ్ళ కాలపరిమితిని ఏకపక్షంగా కుదించడం అధికార కేంద్రీకరణ దిశగా తీసుకున్న చర్యలన్నారు. ఇది ప్రజల అభిమతానికి విరుద్ధమని చెప్పారు. సిసిటివి కెమెరా, వీడియో ఫుటేజ్ వంటి ఎలక్ట్రానిక్ రికార్డులను బహిరంగంగా తనిఖీ చేయడానికి గల హక్కును ఈ సవరణతో రద్దు చేశారని విమర్శించారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

అపర చాణక్యుడు వీరారెడ్డి

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఘనంగా బిజివేముల వీరారెడ్డికి నివాళి

వీరారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న

ప్రజాశక్తి - బద్వేలు

కడప జిల్లా రాజకీయాన్ని తన కనుసైగల్లో నియంత్రించిన అపచాణక్యుడు వీరారెడ్డి అని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి, క్రీ.శే. బిజివేముల వీరారెడ్డి 24 వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఎస్‌బివిఆర్ కళాశాల ప్రాంగణంలోని వీరారెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని వీరారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వీరారెడ్డి సమితి ఎన్నికల్లో పోటీ చేసిన తర్వాత ఆరుసార్లు బద్వేల్ ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా పనిచేసి రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలను ప్రజలు తిలకించారు. హైదరాబాద్‌కు చెందిన మెడ్ విజ్ కంటి, దంత, షుగర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలు తండోప తండాలుగా వచ్చివైద్య చికిత్సలు పొందారు. అవసరమైన వారికి మందులు కూడా నిర్వాహకులు అందజేశారు. భారీ ఎత్తున బివిఎస్ఆర్ కళాశాల ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ రెడ్డి, లీల కైవల్య రెడ్డి, జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త భూపేష్ రెడ్డి, ప్రముఖ నేత్ర వైద్యులు రవికుమార్ రెడ్డి, బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడు మంచూరు సూర్యనారాయణరెడ్డి, జడ్‌పిటిసి జయరాం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు మునిరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, బద్వేల్ పట్టణ అధ్యక్షులు వెంగల్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు రవి కుమార్ రెడ్డి, నియోజకవర్గంలోని ఆయా మండలాల టిడిపి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని తాగాలి

ప్రజాశక్తి - బద్వేలు : ప్రతి ఒక్కరూ కలుషితం లేని తాగునీరు తీసుకున్నప్పుడే మంచి ఎటువంటి జబ్బులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని యోగానంద ఫౌండేషన్ చైర్మన్ స్వామినాథం పేర్కొన్నారు. బ్రహ్మంగారిమఠం మండలం పెద్దిరాజుపల్లి గ్రామంలో బుధవారం ఉచిత తాగునీటి వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటిక ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చిన తరుణంలో ఇటలీ సంస్థ ద్వారా యోగా నంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి వసతిని కల్పించామన్నారు. ఎవరైనా తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి తీసుకొజ్తే సమస్యను పరిశీలించి ఉచిత తాగునీటి పథకం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పెద్దిరాజు పల్లి గ్రామపెద్దలు, గొల్లపల్లి చంద్రశేఖర్, నాగిపోగు దాన మయ్య, సుంకర ఏసోబు, సుంకర కిషోర్, నాగిపోవు దేవదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నఫౌండేషన్ చైర్మన్

సలావుద్దీన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు, అతిథులు

ఉర్దూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

- ప్రభుత్వాన్ని కోరిన రూట నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని, ఉర్దూ అంగన్వాడీలు స్థాపించాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమామ్ బాషా, సయ్యద్ ఇక్బాల్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నగరంలోని వినాయక నగర్‌లో ఉన్న సిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో రూట 35 సంవత్సరాల విజయోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్ బాబు, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు జిలాని బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీలు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ఎందుకు కృషి చేస్తామన్నారు. ఉర్దూ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్ రెగ్యులర్ చేసి అవసరమైన ఆచార్యుల పోస్టులు మంజూరుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లతామని చెప్పారు. ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ ప్రభుత్వమూ ఉర్దూ భాషాభివృద్ధికి పూర్తిగా స్థాయిలో కృషి చేయలేదని తెలిపారు. 2008 ముందు, తర్వాత అధికారంలోనికి టిడిపి, వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ఉర్దూ పాఠశాలలో ఒక్క ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉర్దూ మనుగడ తీవ్ర ప్రమాదంలో ఉందని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉర్దూ భాష చాలా ప్రమాదంలో ఉందని చెప్పారు. ఏపీ ప్రభుత్వం ఉర్దూ భాషను రెండవ అధికార భాషగా ప్రకటించిందని తెలిపారు. అమలులో చిత్తశుద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అఫ్సర్ ఖాన్, మన్సూర్ ఖాన్, ఖాజాపీర్ ఖాన్, రాష్ట్ర మైనార్టీ నాయకులు జమాల్, ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష, రూట రాష్ట్ర నాయకులు హకీం, సిరాజ్, సత్తార్ ఫైజి, అసదుల్లా, ముజీబ్ షాహి, నఖీఉల్లా, ముస్తాక్, ఖలందర్ బాష, రఖీబ్, కలీం, ఆచార్యులు డాక్టర్ వసీవుల్లా, డాక్టర్ షాజియా, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఎలక్షన్ కమిషన్ స్వతంత్రతను ప్రజలే రక్షించుకోవాలి

ప్రజాశక్తి - కడప

ఎన్నికల కమిషన్ స్వతంత్ర స్థానం ప్రజలే రక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గం సమన్వ యకర్త బండి జకరయ్య అన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి సిసిపుటేజీ, వెబ్ కాస్టింగ్, అభ్యర్థుల వీడియోలు, ఎలక్ట్రానిక్ రికార్డుల తనిఖీని నిషేధించి మోడీ ప్రభుత్వం పారదర్శకతకు నిలువునా పాతర వేసిందన్నారు. 1961 ఎన్నికల నిర్వహణ నిబంధనలోని రూల్ 93 (2)(ఎ) ప్రకారం ఎవరైనా ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ చేయడానికి అనుమతి ఉందన్నారు. డిసెంబర్ 20న కేంద్ర న్యాయశాఖ సవరణ నోటిఫికేషన్ ద్వారా ప్రజలకు ఇప్పుడు ఆ అవకాశం ఉండదని చెప్పారు. ఇకనుంచి ఎలక్ట్రానిక్ రికార్డుల పరిశీలన కుదరదని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఎన్నికల రూల్సును ఏకపక్షంగా మార్చేసింది అన్నారు. రిగ్గింగు, అవకతవకలు సహా ఎన్నికల్లో అక్రమాలను నిరోధించేందుకు పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం సిసి టీవీ ఫుటేజీలు, వెబ్ క్యాస్టింగ్‌ను కొనేళ్ల కిందట ప్రవేశపెట్టిందన్నారు. కానీ ప్రస్తుత రూల్స్ మార్పుపై అటువంటిదే ఉండదన్నారు. ఎన్నికల రికార్డులు బయటపడితే బిజెపికి ఇబ్బందికరమని భయంతోనే మోడీ సర్కార్ ఎలక్ట్రానిక్ రికార్డుల తనిఖీపై నిషేధం విధించిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ఆ సవరణలను ఉపసంహరించుకోవాలన్నారు. లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని వాపోయారు. కాంగ్రెస్ నాయకులు జైరామ్ రమేష్ ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో ఛాలెంజ్ చేయనున్నారు అని తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న జకరయ్య

టీ వనం స్టాల్‌ను ప్రారంభిస్తున్న భూపేష్‌రెడ్డి

అందరి మన్ననలు పొందాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అందరి మన్ననలు పొంది వ్యాపారం వృద్ధి చేసుకోవాలని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన 'ఇక టీ వనం' దుకాణాన్ని బుధవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం పంచేలా టీ వనం ఎంపిక చేసుకోవడంలో ప్రొప్రయిటర్ జింకల బాషా ప్రజాభిమానం పొందారన్నారు. వినియోగదారులకు కావల్సినవి అందించి బాగా వ్యాపారం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. జింకల బాషా మాట్లాడుతూ స్థానికులకు ఇక టీ వనం అందుబాటులో ఉందని తెలిపారు. దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, జాంబపురం రమణారెడ్డికి పూల బొకే ఇచ్చి జింకల బాషా స్వాగతం పలికారు. ముఖ్యఅతిథులకు జింకల బాషా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మోరగుడి డీలర్ విశ్వనాథరెడ్డి, పాలూరు సుధీర్ కుమార్‌రెడ్డి, వెల్డింగ్ గైబు, జింకల బాషా శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కోరారు. వైసిపి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన రాజీవ్‌బాషా మండలంలోని దుంపలగట్టులో బుధవారం రెడ్యంను కలిశారు. ఈ సందర్భంగా రెడ్యం రాజీవ్‌బాషాను ఘనంగా సన్మానించారు. అనంతరం రెడ్యం మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాల తప్పిదాలను ప్రజలకు వివరించి ఎండగట్టాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు అహర్నిశలు కృషి చేయాలని కోరారు.

షాదీఖానా అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న షాదీఖానా అభివృద్ధికి ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో చర్యలు చేపట్టారు. షాదీఖానా సమీపంలో బళ్లారి-నెల్లూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు కావడంతో షాదీఖానా వద్ద అభివృద్ధి చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఇందుకోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించి సాధికార అభివృద్ధి పనులు చేపడుతున్నారు. టిడిపి ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు పాలమాబు, 6వ వార్డు ఇన్‌ఛార్జి ఖాసీం పీరా, కౌన్సిలర్ అబ్దుల్ ఖాదర్, నూర్, అక్బర్, ముస్లిం నాయకులు బుధవారం ఆ పనుల్లో పాల్గొన్నారు.

నేడు ఎన్.ఓబాయపల్లెలో ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఎన్.ఓబాయిపల్లి గ్రామంలో గురువారం ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. ఆధార్ కార్డులలో వివిధ రకాల సమస్యలు ఉన్నవారు గురువారం నిర్వహిస్తున్న క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం సోమాపురం, శనివారం పెద్ద గురువలూరు గ్రామాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేరు, పుట్టిన తేదీ, అడ్రస్ మార్పుల వంటి సమస్యలు ఉన్నవారు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక బాల ఆధార్ శిబిరం

ప్రజాశక్తి - ముద్దనూరు

అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల 26 నుంచి 28 వరకు ప్రత్యేక బాల ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ముకుందారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 26న పెనికలపాడు, 27న యామవరం, 28న ముద్దనూరులో ప్రత్యేక బాల ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆధార్ నమోదు కోసం చిన్న పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, తల్లి, తండ్రి ఆధార్ కార్డు, చిన్న పిల్లలని వెంట తీసుకుని రావాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులు హాజరై ఆధార్ నమోదు చేయించాలన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై రేపు పోరుబాట ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపిపి టి.లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు పార్టీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా బయల్దేరి విద్యుత్ డిఇ కార్యాలయం వరకు సాగి, వినతి పత్రమివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి ముఖ్యనాయకులు, మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు పాల్గొంటారని పేర్కొన్నారు. ర్యాలీలో వైసిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపిపి కోరారు.

మినుము నూర్పిడి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

రబీలో సాగు చేసిన మినుము పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది మినుము పంట సాగును అధికంగా చేపట్టారు. గత ఖరీఫ్‌లో వరి సాగు చేయని రైతులు మినుము సాగు చేపట్టారు. ఎకరాకు 3 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడులు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అధిక వర్షాలకు దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. క్వింటా రూ.8 వేలకుపైగా ధరలు పలుకుతున్నాయి. జిల్లాలో 15 వేల ఎకరాల్లో మినుము సాగైంది. గత ఏడాది మినుములు ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఏడది సగానికిపైగా దిగుబడులు తగ్గాయి. పెట్టుబడి భారం ఉండి, దిగుబడి తక్కువగా వచ్చే పంటల సాగు తగ్గిస్తున్నారు. జిల్లాలో వరి తర్వాత వేరుశనగ, శనగ ప్రధాన పంటలుగా చాలా ఏళ్లుగా రైతులు సాగు చేస్తున్నారు. ఆయా పంటలు మూడేళ్లుగా ఆశాజనకంగా కనిపించడం లేదు. వాతావరణంలో మార్పుల కారణంగా పంట దిగుబడులు తగ్గిపోవడం, నాణ్యత లేకపోవడం, జింక్ లోపంతో పెట్టుబడి సమస్య ఎక్కువ కావడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది వేరుశనగ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే సాగుకు అధిక ఖర్చులు అవుతుండటంతో ఎక్కువ పెట్టుబడి భారం కానీ మినుము పంట వైపు రైతులు దృష్టి సారించారు. మినుము పంటలో కూడా దిగుబడులు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువగానే ధరలు వస్తుండడం, వ్యవసాయ అధికారులు కూడా ఎప్పుడూ ఒకే రకం పంటలు సాగు చేయడం వల్ల దిగుబడులు రావడం లేదని సూచించారు. పంట మార్పిడితో దిగుబడులు పెరుగుతాయని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఏడాది పంట మార్పిడి పద్ధతి అవలంబించాలని రైతులకు సూచిస్తున్నారు.

మినుము పంటను నూర్పిడి చేస్తున్న రైతు

అధ్వానం అనుసంధాన రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్యన ఉన్న అనుసంధాన గ్రావెల్ రోడ్డు అధ్వానంగా ఉంది. నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్య పంట పొలాల్లో ఉన్న రహదారి గుంతలమయంగా మారి రైతులకు ఇబ్బందికరంగా తయారైంది. పంట పొలాలకు ఎరువులు తరలించడం, ధాన్యాన్ని ఇంటికి తెచ్చేందుకు ఈ మార్గాన ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ మార్గానికి మరమ్మతులు చేపడితే చాపాడుకు నెర్రవాడ నుంచి తక్కువ సమయంలో వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. చియ్యపాడు, బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాల రైతులకు ఈ మార్గంలో పంట పొలాలు ఉన్నాయి. వరి, పసుపు, మెక్కజొన్న, దోస వంటి పంటలు ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ రహదారికి అనుసంధానంగా మళ్లీ పంట పొలాలకు వెళ్లే అడ్డ రోడ్లు రెండు ఉన్నాయి. 500 ఎకరాలకుపైగా ఈ రోడ్డు పరిధిలో పంట పొలాలు ఉన్నాయి. ఈ మార్గంలో రెండు ప్రదేశాల్లో నీరు ప్రవహిస్తూ రోడ్డు అధ్వా

అసౌకర్యంగా నెర్రవాడ-చియ్యపాడు రోడ్డు

నంగా ఉంది. మిగిలిన ప్రాంతంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు ప్రయాణించేందుకు అసౌకర్యంగా తయారైంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడితే రైతులకు,ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

తాగునీటి సమస్యనూ తీర్చని వైసిపి ప్రభుత్వం

బోరు వేస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గత ఐదేళ్ల పాలలో వైసిపి ప్రభుత్వం పులివెందులలో తాగునీటి సమస్యను కూడా తీర్చలేదని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. స్థానిక నగిరిగుట్ట రామాలయ సమీపం బుధవారం సాయంత్రం తాగునీటి కోసం బోరు వేస్తున్న సందర్భంగా ఆయన పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ చేసిన తప్పులు తప్పించుకునేందుకు కూటమి ప్రభుత్వంపై నిందలు వేసేందుకు వైసిపి నాయకులు ఉన్నారన్నారు. అభివృద్ధి పేరుతో ఎంత నిధులు దుర్వినియోగం చేశారో చెప్పకనే తెలుస్తోందన్నారు. అభివృద్ధి పేరుతో పులివెందుల ప్రాంతాన్ని సర్వ నాశనం చేశారని రవి విమర్శించారు. ఈ విషయాలను స్థానిక ప్రజలు గమనించాలని, ఇప్పటికైనా మార్పు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పులివెందుల ప్రాంతానికి తాగునీరు అందించేందుకు దృఢ సంకల్పంతో తాము ముందుకు వెళుతున్నామన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి కూడా అంగీకరించారన్నారు. ప్రజలు, ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, నల్లారి భాస్కర్‌రెడ్డి, ఖాసింవలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడవాడలా క్రిస్మస్ వేడుకలు

ఎల్‌ఎం కాంపౌండ్‌లో కబడ్డీ ఆడుతున్న మహిళలు

ప్రజాశక్తి - ముద్దనూరు

క్రిస్మస్ సందర్భంగా మండలంలోని క్రైస్తవులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని అన్ని చర్చిలను విద్యుత్ దీప కాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ముద్దనూరు సిఎస్ఐ, ఎస్పిజి (సిఎస్ఐ), ఆర్‌సిఎం, మన్నా, హెబ్రోన్ చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని చర్చిలో రెవరెండ్ పాస్టర్ జెడి వినయ్‌కుమార్, ఎస్పిజి (సిఎస్ఐ) చర్చిలో రెవరెండ్ పాస్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. క్రిస్మస్ తాత వేషధారణలతో ఆకట్టుకున్నారు. క్రికెట్, కబడ్డీ, రన్నింగ్, లాంగ్ జంపు, మ్యూజికల్ ఛైర్స్ ఆటలు నిర్వ హించారు. చిన్నారులు, యువకులు, మహిళలు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు సర్పంచ్ బోనం సరళ బహుమతులు అందజేశారు. కమిటీ పెద్దలు అబ్రహాం, ఏసుదాసు, జయన్న, రమేష్, చంద్ర, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కడప : కడప నగరం కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి, కేక్ కట్ చేసి అందరికి పంచారు. యస్.విమల, దివ్య చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, అశోక్, రోజా, వెంకటేష్, భరత్, లోకేష్, ఆశీర్వాదమ్మ, శ్రావణి, నరసయ్య, అంజలి, అందలమ్మ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణ నలుమూలల నుండి భక్తులు హాజరై ప్రపంచ ప్రజలందరి కొరకు రాజుల కొరకు అధికారుల కొరకు ప్రత్యేక ప్రార్థలు చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

చాపాడు : క్రిస్మస్ సందర్భంగా ఆదివారం వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. చర్చిలను విద్యుదీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మత

గుంతచియ్యపాడు చర్చిలో కేక్ కట్ చేస్తున్న మహేష్ యాదవ్

పెద్దలు, ఫాస్టర్లు ఏసుక్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. గుంత చియ్యపాడు చర్చిలో మంగళవారం రాత్రి ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. వైసిపి యువ నాయకుడు దాసరి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, జడ్‌పిటిసి జె.రాజీ, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, తహశీల్దార్ రమాకుమారి, ఎస్ఐ చిన్న పెద్దయ్య ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

వేంపల్లె : మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధాన కూడళ్లలోని చర్చిలను విద్యుత్తు దీపాలతో అలకరించి క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. స్థానిక క్రిష్టియన్ కాలనీలో ఉన్న సిఎస్ఐ చర్చిలో ఫాస్టర్ స్టీఫెన్ పాల్, మదర్ థెరిస్సా చర్చిలో ఫాస్టర్ బాలస్వామి, బిడ్డాలమిట్టలోని కల్వరికుంట క్రీస్తు సంఘం చర్చిలో ఫాస్టర్ రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు నాగన్న, సత్యమయ్య, ఆంథోని, నర్సయ్య, సాలువాది ఆనంద్, యవ్వనస్తులు మైఖేల్, కరుణాకర్, మిసేక్, ప్రవీణ్ కుమార్, దావిద్ పాల్గొన్నారు.

కడప అర్బన్ : ప్రకృతి నగర్ లోని కేశవరెడ్డి పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

కడప అర్బన్ : కేశవరెడ్డి పాఠశాలలో..

ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఫౌండర్ చైర్మన్ కేశవ రెడ్డి విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎజిఎం శ్రీదేవి క్రిస్మస్ పండుగ గొప్పదనాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిన్ని కృష్ణ, డీన్ ద్వారకానాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల (కాశినాయన) : పోరుమామిళ్ల లోని వెంగమాంబ పాఠశాలలో మంగళవారం ఆ పాఠశాల కరస్పాండెంట్ పుల్లప్ప నాయుడు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో క్రిస్మస్‌కు సంబంధించి వివిధ రూపాలలో బొమ్మలను చిత్రీకరించి కరస్పాండెంట్, ప్రిన్సిపల్ క్రిస్మస్ గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ప్రపంచంలో క్రిస్మస్ ఎందుకు చేసుకోవలసి వచ్చింది, ఏ సందర్భంలో పండుగ చేస్తారో వివరించారు. పాఠశాల ఆవరణంలోనే పశువుల పాక ఏర్పాటు చేసి ఏసుప్రభువు పశువుల పాకలో జన్మించాడు. కనుక ప్రతిచోట ప్రతి చర్చి ముందు పశువుల పాకను అందరు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో చిన్నారులు వివిధ వేషధారణలు ధరించి పలువురిని అలరించారు.

నరసాపురంలో.. నరసాపురంలోని సిఎస్ఐ చర్చిలో బుధవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో పాస్టర్ జోసఫ్ సంఘంలోని సభ్యులతో క్యాండిల్స్ వెలిగించారు. బుధవారం మధ్యాహ్నం పాస్టర్ రాజరత్నం క్రీస్తు జననం గురించి సంఘ సభ్యులకు క్లుప్తంగా వివరించారు. వరికుంట్ల, గుంటువారిపల్లె, బాలాయిపల్లె, పిట్టిగుంట పలు గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు.

వెంగమాంబ పాఠశాలలో..

పైప్‌లైన్ లీకేజీ.. తాగునీరు కలుషితం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సోమాపురం దళితవాడలో కులాయి పైపు పగిలిపోవడంతో గ్రామంలో సరఫరా అవుతున్న నీరు కలుషితమవుతోంది. ఉపరితల జలాశయం ద్వారా సరఫరా అయ్యే నీరు వచ్చే సందర్భంలో పైపు నుండి నీరు వృథాగా పోతోంది. ట్యాంకు నుండి నీటి సరఫరా ఆగిన సందర్భంలో మురుగు కుంటలోని నీరు పైపుల్లోకి వెళుతోంది. మురుగునీరు మళ్లీ పైపులైను ద్వారా సరఫరా అవుతూ నీరు కలుషితం చేస్తోంది. గ్రామంలో డ్రయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగునీరు పూర్తిగా రోడ్లపై పారుతోంది. చేతిపంపుల వద్ద కూడా వ్యర్థ నీరు ప్రవహించే ఏర్పాటు లేకపోవడంతో అక్కడ మురుగు కుంటలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముగురు కాలువలను ఏర్పాటు చేసి, వ్యర్థ నీరు తొలిగేందుకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

రోడ్ల వెంబడి పారుతున్న మురుగునీరు

రోడ్డుపై మురుగు.. అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక చింతలమడుగుపల్లె పల్లె రహదారిలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. ఆ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిలోని శ్మశాన వాటికి సమీపంలో రోడ్డుపై చెత్త చెదారం ఎక్కువగా ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ రహదారి వెంట నడిచే ప్రజలు దుర్వాసనతో అల్లాడుతున్నారు. రోడ్డుపై చెత్త చెదారం ఎక్కువగా ఉండడం, డ్రయినేజీ పూడిపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. దుర్వాసనతోపాటు దోమలు విపరీతంగా వేధిస్తున్నాయని వాపోతున్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా, రోడ్డుపై ఉన్న చెత్త చెదారం తొలగించే పనులను అధికారులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల బృందంతో పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ఢిల్లీ విజ్ఞాన యాత్రకు విద్యార్థులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని హిమకుంట్ల, సింహాద్రిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఢిల్లీకి విజ్ఞాన వినోదయాత్రకు బుధవారం బయల్దేరారు. హిమకుంట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిపి 31 మంది కడపకు ప్రత్యేక వాహనంలో వెళ్లారు. అక్కడి నుంచి విమానంలో హైదరాబాదు విమానాశ్రయం, అనంతరం ఢిల్లీకి మరో విమానంలో వెళ్లనున్నారు. ఐదు రోజులపాటు సాగే ఈ విజ్ఞాన వినోదయాత్ర విద్యార్థులకు పూర్తిగా ఉచితం. వీరికి మాజీ జడ్‌పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆల్ ద బెస్ట్ చెప్పి, పలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిచంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు' సంక్రాంతికైనా అమలయ్యేనా..!

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేందుకు ప్రధాన కారణం సూపర్‌సిక్స్ పథకాలేనని, వాటిలోని ప్రధాన పథకమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సంక్రాంతికైనా అమలవుతుందానని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం హామీని మహిళలు నమ్మి మూకుమ్మడిగా టిడిపి కూటమికి ఓట్లు వేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను విస్మరించిందని విమర్శించారు. ఏరు దాటి నంతవరకు ఓడ మల్లన్న, దాటాక బోడి మల్లన్న అన్న విధంగా కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తున్నట్లు చెప్పారు. కర్ణాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే ఆ హామీని అమలు చేసి మాట నిలుపుకుందన్నారు. తెలంగాణాలో రేవంత్‌రెడ్డి పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కూడా మూడు నెలల్లోపే అమలు చేసిందని తెలిపారు. ఎపిలో 6 నెలలు దాటినా ఉచిత బస్సు ప్రయాణం పథకం అతీగతీ లేదని తెలిపారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రైతులు, మధ్య తరగతి, వ్యాపార వర్గాలకు ఎంతో ఉపయోగంగా ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కన్వీనర్ రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానికంగా బుధవారం జరిగిన సమావేశంలో కరపత్రాలను పలు సంఘాల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిజిబి రైతులకు మధ్య తరగతి ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కరువు పీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. దేశంలో ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో అగ్రస్థానంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉందన్నారు. 552 శాఖలతో రూ.50 వేల కోట్ల టర్నోవర్‌తో రూ.802 కోట్ల లాభాలతో రూ.4591 కోట్ల రిజర్వుతో వ్యాపార అభివృద్ధిలో మిగతా గ్రామీణ బ్యాంకుల కన్నా అగ్రభాగాన ఉందన్నారు. ఇక్కడ 2,800 ఉద్యోగులు పనిచేస్తున్నారని, మిగిలిన మూడు గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగులను కలిపినా అంతమంది లేరన్నారు. ఏ బ్యాంకు అయితే డిపాజిట్లు టర్నోవర్ ఎక్కువగా ఉంటే ఆర్థిక శాఖ మార్గదర్శకాల తొలి ప్రాధాన్యత ప్రకారం తీసుకోవాలన్న సూచన ఉందన్నారు. ఆ ప్రకారం కడప ప్రధాన కార్యాలయాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆందోళన కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. జెవివి రాష్ట్ర నాయకుడు తవ్వా సురేష్ మాట్లాడుతూ త్వరలో ఓ సదస్సు నిర్వహిస్తామని, అందులో కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఇ.శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్బర్ బాషా, ప్రొద్దుటూరు బ్రాంచ్ కార్యదర్శి నరసింహులు, గ్రంథాలయ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబ్జి, డెవలప్మెంట్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఎల్ఐసి ఏజెంట్ ఫెడరేషన్ డివిజన్ కోశాధికారి కృష్ణ, ఎపిజిబి రాజేష్, జెవివి నాయకులు మురళి గుప్తా, డాక్టర్ చక్రధర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

29న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు టివిఆర్ హైస్కూల్ సమీపంలో జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి అమర్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు, 18,16ఏళ్లలోపు బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొన దలచిన వారు వయసు ధ్రువీకరణకు ఆధార కార్డు తమ వెంట తీసుకురావాలని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ (దూరపు పరుగు పందెం పోటీలు) జనవరి 5న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరుగుతాయని అన్నారు. వివరాలకు 99496 86586ను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామం, వైఎస్ఆర్ ఉల్లిమెల్ల లేక్ ఫ్రంట్ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం సాయంత్రం శిల్పారామంలో కరస్పాండెంట్ గీత విజయవాడ ఎక్సలెంట్ ఇనిస్టిట్యూట్ వారి నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ పులివెందుల చిన్నరులచే శ్రీ చిట్టి డ్యాన్స్ మాస్టర్ అధ్వర్యంలో.. డాక్టర్ వైఎస్ఆర్ ఉల్లిమెల్ల లేక్ ఫ్రంట్‌లో రామాంజి జ్యువెలర్స్, పిఎస్‌వి జ్యువెలర్స్, డికె సావర్కర్ ట్రావెల్స్ వారి సౌజన్యంతో శ్రీసూర్య, సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి వారి శిష్య బృందంచే జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామ పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో చిన్నారులు